క్లుప్తంగా

అందరి సహకారంతోనే అభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

గుర్ల: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ శేషుబాబు అన్నారు. తన కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సమస్యలుంటే మండల అధికారులకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులచే అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈఓపీఆర్‌డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకులపేటలో వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి ఆకులపేట గ్రామంలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రవైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 34 మందికి గరివిడి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించి 18 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారని సంస్థ వ్యవస్థాపకుడు బివి.గోవిందరాజులు తెలిపారు. శిబిరంలో పలువురు తమ వంతు సేవలు అందించారు.

స్మార్ట్‌మీటర్లు వద్దే వద్దు..



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: అదానీ స్మార్ట్ మీటర్ల దోపిడీని ఆదిలోనే అడ్డుకోవాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు గాడి అప్పారావు, జి.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గాంధీనగరం వద్ద స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంబంధిత పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

48 మందికి వైద్య సేవలు



రోగులను తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్

గజపతినగరం: మండలంలోని మధుపాడ గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన 104 వైద్య శిబిరంలో 48 మంది రోగులను పరీక్షించినట్టు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్టు పేర్కొన్నారు. శిబిరానికి రాలేని వారికి ఇంటికి వెళ్లి పరీక్షించినట్టు తెలిపారు.

రెవెన్యూ సదస్సులో పది దరఖాస్తుల స్వీకరణ



సదస్సులో మాట్లాడుతున్న నోడల్ అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పది అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పది అర్జీలలో అక్కడికక్కడే రెండింటిని పరిష్కరించినట్టు తహసీల్దార్ తెలిపారు. గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, పలువురు రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



గీతా పారాయణంలో పాల్గొన్న భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో గీతా జయంతిని బుధవారం మాజీ సర్పంచ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య భగవద్గీత పారాయణం చేసారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.



మరడాంలో సాగులో ఉన్న టమాట పంట

- విత్తన ఎంపికే ప్రధానం
- రబీలో రైతుల ఆసక్తి



చౌదంతివలసలో సాగులో ఉన్న మిరప పంట

కూరగాయల సాగుకు.. శీతాకాలం అనుకూలం

దత్తిరాజేరు:

రబీ సీజన్‌తో పాటు శీతాకాలం కూరగాయల సాగుకు అనుకూలం. అధిక ఆదాయం వచ్చే పంటలు కూడా ఈ సీజన్‌లో సాగు చేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా దుంప కూరలు, క్యాబేజీతో పాటు ఏడదంతా వచ్చే మిరప, టమాట, వంగ పంటలు ఈ సీజన్‌లో సాగు ఎక్కువగా చేయడం వల్ల అధిక లాభాలు వస్తాయని ఉద్యాన నిపుణులు సూచిస్తున్నారు. ఖరీఫ్ పంటలతో పోల్చితే రబీలో దిగుబడులు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. గజపతినగరం నియోజకవర్గంలో దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి, మరడాం, కె కొత్తవలస, చౌదంతివలస, వి.క్రిష్ణాపురం, వింద్యవాసి, వంగర, మర్రివలస, బొండపల్లి మండలంలోని దేవుపల్లి, గొల్లపాలేం, బొండపల్లి, అంబటివలస గొట్లాం, గజపతినగరం మండలంలోని మరుపల్లి, మధుపాడు గ్రామాలలో ఎక్కువగా కూరగాయాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఈ సాగుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెలకువలు తప్పనిసరి

రబీలో కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు తద్వారా అధిక నికర ఆదాయం పొందాలంటే రైతులు కొన్ని మెలకువలు పాటించాలి. నీరు ఉంటేనే సాగుకు సిద్ధం కావాలి. చీడపీడలను తట్టుకొని దిగుబడి ఇచ్చే రకాలను ఎంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో సిఫార్సు చేసిన వంగడాలనే సాగులో వేయాలి. రబీలో చలి ఎక్కువగా ఉండడం వల్ల సూక్ష్మధాతు పోషకాలు లోపించే అవకాశాలు ఎక్కువ కాబట్టి అధికారుల సలహాలతో సూక్ష్మధాతు ఎరువులను సిద్ధం చేసుకోవాలి.

హైబ్రిడ్ విత్తనాలతో అధిక దిగుబడులు

కూరగాయాల సాగులో హైబ్రిడ్ విత్తనాల వలన దిగుబడులు పెరుగుతాయి. అందువల్ల హైబ్రిడ్ విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అయితే నాణ్యత లేని విత్తనాలు మార్కెట్‌లో ఉండే అవకాశం ఉంది. కాబట్టి విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. విత్తనాలు విక్రయించే సంచిపై లేబుల్‌లో ఉన్న ప్రమాణాలు, మొలక శాతం, వెన్ను స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత ఇతర వివరాలు పరీక్షిస్తే మంచిది.

నారు పెంపకం

విత్తన మొలక శాతం పరీక్షించిన తరువాతే నారు మడులు పంచుకోవాలి. గింజలను పేపర్‌లో వరుసగా పెట్టి పేపర్ చుట్టాలి. ఆ తర్వాత చీకట్లో ఉంచి ఉదయం, సాయంత్రం సమయాలలో నీరు తడి చేయాలి. వంగ, టమాట విత్తనాలు 5నుంచి 6 రోజులు, మిరప 10 నుంచి 11 రోజులలో మొలకెత్తుతాయి. ఆ తర్వాత 100 విత్తనాలకు ఎన్ని మొలకెత్తితే అంత శాతంగా నిర్ధారించుకోవాలి.

విత్తనాలు ఎంపికలో జాగ్రత్తలు అవసరం

రైతులు కూరగాయలు పండించడానికి శీతాకాలం అనుకూలంగా ఉంటుంది. కాకపోతే కూరగాయాల విత్తనాలను విత్తన సమయంలో ఎంపికపై జాగ్రత్తగా వ్యవహరించాలి. నాసిరకం విత్తనాలతో డబ్బు, శ్రమ వృధా అవుతుంది. ప్రభుత్వం గుర్తించిన కంపెనీల విత్తనాలనే ఉపయోగించాలి. విత్తన శుద్ధి చేయడం మరిచిపోకూడదు. విత్తన సంచిని పారివేయకుండా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. కొనుగోలు సమయంలో విధిగా రసీదును తీసుకోవాలి. లైసెన్స్ ఉన్న విత్త విక్రయ కేంద్రాలు వద్దనే కొనుగోలు చేయాలి.

– రాజశేఖర్, ఉద్యాన అధికారి, గజపతినగరం

కూటమి సర్కారు దగాపై పోరు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తదితరులు

- సూపర్ సిక్స్ పేరిట పచ్చి మోసం
- కూటమి ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదు
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని, ప్రజలను దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఈ నెల 13న చేపట్టనున్న అన్నదాతకు అండగా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ కార్యాలయంలో రైతుల పక్షాన ఈ నెల 13న వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు అందుకు విరుద్ధంగా పెంచుతూ పోతున్నారని దుయ్యబట్టారు. దీనిపై ఈ నెల 27న ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటుకు సంబంధించి జనవరి 3న పోరాటం చేయనున్నామని పేర్కొన్నారు. పై మూడు కార్యక్రమాలకు గజపతినగరం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ధాన్యం విక్రయాల్లో మోసం

జిల్లాలో ధాన్యం విక్రయాల్లో దళారుల దందా పెరిగిపోయిందని బొత్స అప్పలనరసయ్య దుయ్యబట్టారు. అన్నదాతను అన్ని విధాల కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ, సూపర్ సిక్స్‌పై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నేతలు కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాధరావు, కడుపుట్ల పైడపునాయుడు, పి.నారాయణమూర్తి, పాండ్రంకి సూర్యప్రకాష్, శీర రమణ, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

గజపతినగరం: బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న గజపతినగరం మండలానికి సంబంధించి చౌక ధరల దుకాణ డీలర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తహసీల్దార్ రత్నకుమార్ బుధవారం తెలిపారు. గజపతినగరం మండలం బంగారమ్మపేట, గుడివాడ, పాత బగ్గాం, కొత్తబగ్గాం, పురిటిపెంట 1, ఎం.వెంకటాపురం, పిడిశీల గ్రామాల్లో డీలర్ల పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తుదారు ఇంటర్ ఉత్తీర్ణత సాధించి, 18 – 40 మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు.

'ప్రతి ఇంటికి భగవద్గీత చేర్చాలి'

శృంగవరపుకోట: భగవద్గీత పఠనం ప్రతి భారతీయుని కర్తవ్యం అన్న కార్యక్రమాన్ని పట్టణంలో స్థానిక మోక్షవిద్య యోగమందిర్ గీతా జయంతి సందర్భంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి భగవద్గీత చేర్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని సంస్థ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు తెలిపారు. ప్రతి ఇంటికి భగవద్గీతను అందించే కార్యక్రమాన్ని సంస్థ సభ్యురాలు మాడెం పార్వతి ప్రారంభించి పుణ్యగిరి రోడ్డు లో ఉన్న గృహస్తులకు భగవద్గీత పుస్తకాలు అందచేశారు. దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పుస్తకాలు కావాల్సిన వారు 9989368781 లేదా 9866757311 నంబర్లను సంప్రదించాలని కోటేశ్వరరావు సూచించారు.

న్యాయపోరాటం చేస్తాం

శృంగవరపుకోట: కంపెనీ పెట్టి స్థానికులకు ఉపాధి కల్పిస్తామంటూ రైతుల నుంచి సేకరించిన భూములను అమ్ముకుని సొమ్ముచేసుకుందామని చూస్తున్న జిందాల్ యాజమాన్యంపై న్యాయపోరాటానికి సిద్ధమని ఎమ్మెల్సీ రఘురాజు చెప్పారు. చినఖండేపల్లి గ్రా మంలో బుధవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. 2016లో జిందాల్ ప్రభుత్వంతో చేసుకున్న ఎంఓయూ రద్దయ్యిందని, పీఓటీ కేసులు నాడు గ్రామపెద్దలు సెటిల్ చేస్తే ఇప్పుడు తమకు అనుకూలమైన వ్యక్తులను పిలిచి పరిహారం ఇచ్చి సంతకాలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఎంఎస్ఎంఈ పార్కుకు తాము వ్యతిరేకం కాదని, రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అవగాహన



లక్కవరపుకోట: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఈ హనుమంతురావు

లక్కవరపుకోట: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మండల స్థాయి అధికారులకు నీటి పారుదల శాఖ జేఈ హనుమంతురావు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. మండలంలో 18 నీటి సంఘాలు ఉండగా, 14 వేల మంది రైతులు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని, ఇందుకు తగ్గట్టు అనుసరించాల్సిన నియమ నిబంధనలను జేఈ వివరించారు. తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో నాగుల చెరువు సాగునీటి సంఘానికి సంబంధించి నోటిఫికేషన్‌ను అధికారులు బుధవారం ప్రచురించారు. ఎన్నికల అధికారి సులోచనదేవి నోటిఫికేషన్‌ను ప్రచురించారు. ఈ నెల 14న ఎన్నిక జరగనుంది.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



సోంపురంలో తెలుగు పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ–2 బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శాంప్–1 తెలుగు పరీక్ష నిర్వహణను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధమవ్వాలని సూచించారు. ఏ సబ్జెక్టులోనైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఉపాధ్యాయునితో నివృత్తి చేసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ బీపీఏ రాజు, సీఆర్‌పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి ఇనాం భూముల సమస్య

దత్తిరాజేరు: మండలంలోని భూపాలరాజపురంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ఇనాం భూముల సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1979లో ఇనాం భూములపై సర్వే జరిగిందని, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఐదుగురు వ్యక్తుల పేరిట 32.92 ఎకరాల భూములు ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆ భూములు సాగు చేస్తున్న 60 మంది రైతులు కలిసి ఒకే ఒక్క దరఖాస్తు ద్వారా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారని తెలిపారు. రికార్డుల్లో పేర్లు ఉన్న మరంగంటి వెంకటరమణ, సీతారామాచార్యులు, చిలకమర్రి విజయలక్ష్మి, చిలకమర్రి కస్తూరి, జానకమ్మ, ఐదు కుటుంబాల వారసులు వస్తే వారి అభిప్రాయాలు కూడా తెలుసుకుంటామని చెప్పారు.

15న మండల సమావేశం

బొండపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.గిరిబాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. అధికారులు మూడు నెలలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

వెలవెలబోతున్న రెవెన్యూ సదస్సులు

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు వెలవెలబోతున్నా యి. గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులకు ప్రజలు మొహం చాటేస్తున్నారు. ఆశించిన స్థాయిలో జనస్పందన లేకపోవడంతో అధికారులు అవాక్కవుతున్నారు. ఎప్పటి మాదిరి గానే అధికారులకు అర్జీలు ఇవ్వడం తప్పితే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదనే నిరాశ రెవెన్యూ సదస్సులకు జనాన్ని దూరం చేస్తున్నాయి. భూతగదాలు, చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలు, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఈ సదస్సులపై నమ్మకం పోయేలా చేశాయి. దీంతో తమ సమస్యలు మళ్లీ మొదటికే వస్తున్నాయని అర్జీదారులు వాపోతున్నారు. మండలంలో ఇప్పటివరకు ఏడు గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా 97 అర్జీలు మాత్రమే వచ్చాయి. వీటిలో 16 అర్జీలను పరిష్కరించినట్టు తహసీల్దార్ అరుణకుమారి చెప్పారు.

రైతుల పక్షాన పోరాటానికి సిద్ధం కావాలి



అన్నదాతకు అండగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో సమావేశం

కొత్తవలస: రైతుల పక్షాన పోరాటానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రం అర్ధన్నపాలెం గ్రామం సమీపంలో గల తన క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలో పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా ఈ నెల 13న వైఎస్సార్‌సీపీ చేపట్టబోయే అన్నదాతకు అండగా – కూటమి సర్కారుపై నిరసనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ముఖ్యంగా రైతులకు రైతు సాయం కింద ఏడాదికి రూ.20వేలు అందిస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 123 గ్రామ పంచాయతీల నుంచి పార్టీ శ్రేణులు తరలి రావాలన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతోందన్నారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రైతులకు ఉచిత పంట బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన, జనవరి 3న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ఎస్.కోట జెడ్పీటీసీ ముమ్మలూరి వెంకటలక్ష్మి, ఎస్.కోట వైస్ ఎంపీపీ పి.వెంకటరమణ, ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, ముమ్మలూరి జగన్నాధం, ఒబ్బిన నాయుడు, పార్టీ నాయకులు వాకాడ రాంబాబు, బొంతల వెంకటరమణ, పల్లా భీష్మ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని విజయనగరం ఆర్‌డీఓ దాట్ల కీర్తి అన్నారు. మండలంలోని కిండాం అగ్రహారం గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలపై సదస్సుల్లో అర్జీలు సమర్పించాలని సూచించారు. తద్వారా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఆర్ఐ హరికృష్ణ, సర్పంచ్ బుంగా దేవుడు తదితరులు పాల్గొన్నారు. – బొండపల్లి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ బి.బంగారమ్మ అన్నారు. చీపురుపల్లి మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం సభ్యులకు విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘం, స్వయం సహాయక సంఘాల సహకారంతో ఆయా సంఘాల్లో ఉండే సభ్యులు ఎలా అభివృద్ధి చెందాలో అవగాహన కల్పించేందుకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, గుర్ల, నెల్లిమర్ల ఎఫ్‌పీఓలు, ఏపీఎంలు కె.ఉమామహేష్, ఎల్.పద్మ, సీసీలు పాల్గొన్నారు. – చీపురుపల్లి రూరల్(గరివిడి)

టీబీపై అవగాహన



గుర్ల మండలంలోని కెల్లలో టీబీ వ్యాధిపై టీబీ నియంత్రణ జిల్లా అధికారిణి రాశి బుధవారం అవగాహన కల్పించారు. దగ్గు ఎక్కువగా ఉండడంతో పాటు బరువు తగ్గిపోవడం, టీబీ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. టీబీని తొలి దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చన్నారు. టీబీ వ్యాధిపై ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. – గుర్ల

'అన్నదాతకు అండగా..' తరలిరండి

వేపాడ: అన్నదాతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ ఎంపీపీ సత్యవంతుడు బుధవారం పిలుపునిచ్చారు. రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించే కార్యక్రమంలో అందరూ పాల్గొని సత్తా చాటాలన్నారు.

పోరాటాన్ని విజయవంతం చేయాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విజయనగరంలో రైతు సమస్యలపై ఈ నెల 13న చేపడుతున్న పోరాటాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా సెక్రటరీ వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, మాజీ జెడ్పీటీసీ వరహాలనాయుడు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ బెల్లాన వంశీకృష్ణ పిలుపునిచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తారని తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయనగరం నెహ్రూ యువ కేంద్రానికి ఎదురుగా ఉన్న కంటోన్మెంటు మున్సిపల్ పార్క్ వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.